సంపుటి: 2| సంచిక: 4
మే - జూన్, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక





# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

దేవుని బట్టి ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది ఏమనగా తండ్రియైన దేవుని సమాధానము ఎల్లప్పుడూ మనకు కులుగును గాక !

మన జీవితములలో క్షమించుట అనేది సహజమైన స్వభావముగా ఉండవలయును. ఆకలి వేసినప్పుడు ఆహారము తినుట, దాహము వేసినప్పుడు నీళ్ళు త్రాగుట ఎంత సాధారణమైన సంగతో, బాధపరిచిన, నష్టపరిచిన, మనస్సుకు గాయం చేసిన వారిని క్షమించుట అనేది అంత సాధారణమైన విషయముగా ఉండవలయును. ఈలాంటి స్వభావము మన జీవితములో దేవుని కృపను పొందుటకు ఎంతో అవసరమైనది. కొందరిని గమనించినప్పుడు, భయంకరమైన పగతో జీవిస్తూ, సంవత్సరముల కొలది మాట్లాడకపోవడం, శత్రుత్వమును కనపరచడం కనబడుతుంది. దేవుని ప్రేమలో అతి ముఖ్యమైన లక్షణం క్షమించుట. క్షమించుట అనే గుణమే వ్యక్తులను మహాత్ములుగా మారుస్తుంది. దేవుని ఉద్ధేశ్య ప్రకారం క్షమించుట వలన ఇతరులకు మేలు చేసిన దాని కంటే నీకు నీవు ఎంతో మంచి చేసుకొనుట. క్షమించినవాడు దేవుని క్షమాపణకు అర్హుడు.

మనము, మన కుటుంబములు క్షమించుట అనే గుణమును సాధకము చేసుకొనుట ఎంతో అవసరము. చిన్నతనం నుండి పిల్లలకు క్షమించే గుణం యొక్క ప్రాముఖ్యత తెలియపరిచి, ఆలాగు జీవించే విధంగా ప్రోత్సహించవలయును. అప్పుడు రాబోయే కాలములో సమాజంలో ప్రశాంతకరమైన వాతావరణం మనము చూడగలము.

అట్టి ధన్యత దేవుడు మనకి అనుగ్రహించును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 2 | సంచిక: 4

మే - జూన్, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- ఒంటరిగా ..... 2
- దీర్ఘాయుష్మంతులు ..... 5
- నిర్ణయం (స్త్రీల ప్రత్యేకం) ..... 6
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 34వ భాగము ..... 9
- సంక్షోభ సమయములో (బాలల శీర్షిక) ..... 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ..... 13
- విశ్వాసంలో ఎదుగుట ..... 15
- సులభమైన ప్రార్థన యొక్క శక్తి ..... 18
- ధనమును ఆశించిన ..... 20
- బైబిల్ క్విజ్ - 34 ..... 22
- జన్మదిన శుభాకాంక్షలు ..... 23


మా చిరునామా:

ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,

భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



# ఒంటరిగా..

బ్రదర్. ఎపఫ్రా

ఒంటరితనం అనే విషయం నేడు ప్రపంచమంతటిని ప్రభావితం చేస్తున్నది. దీనికి అతీతులు ఎవ్వరు లేరు. 21వ శతాబ్దములో ఎదుర్కొనే సమస్యలలో ఒక సమస్య, దీనివలన ఎన్నో విధములుగా మనుష్యులు నష్టపోవడం జరుగుతున్నది. ఒంటరితనంలో నుండి బయటపడుటకు రకరకాల చెడు అలవాట్లు నేర్చుకోవడం నేటి యువత చేస్తున్న పెద్ద పొరపాటు. దాని వలన వారి విలువైన జీవితములను మరియు వారి మీద ఆధారపడిన వారి జీవితములకు ఎంతో అన్యాయం చేస్తున్నారు.

అయితే ఒక విషయం మనం తెలుసుకొనవలయును. ఒంటరితనం మరియు ఏకాంతము అనేవి వేరు వేరు విషయములు. ఒంటరితనం చింతను, నిరాశను, ఆందోళనను మనకు కలిగిస్తే, ఏకాంతము మనకు నెమ్మదిని, ప్రశాంతతను కలిగిస్తుంది. దానిలో మనము ఆనందించగలము. ఏకాంతముగా అనేది ఇష్టపూర్వంగా మనుష్యులకు దూరంగా ఉండుట. ఒంటరితనము తృణీకరించబడుట, నిర్లక్ష్యము చేయబడుట విడిచిపెట్టబడుట. ఒంటరితనంలో ఉన్న భయంకరమైన విషయం దాని నుండి పారిపోలేకపోవడం, దానివలన తొందర చేయబడి ఆత్మహత్యకు కూడా పాల్పడేవారు అనేకులు.

బైబిలు గ్రంథములో సృష్టి ప్రారంభములో మనుష్యుడు పతనం కాకముందు మొదట దేవుని దృష్టికి ఒంటరితనము మంచిది కాదు అని అనిపించింది. **మరియు దేవుడైన యెహోవా - నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదుననుకొనెను - ఆది 2:18.** అయినప్పటికి ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు గొప్ప గొప్ప భక్తుల జీవితంలో అనగా యాకోబు, మోషే, యోబు, నెహెమ్యా, ఏలియా, యిర్మీయా, దావీదు నూతన నిబంధనలో ఉన్న యేసుక్రీస్తుతో సహా అందరి జీవితములలోను ఒంటరితనము ఎన్నో సందర్భములలో బాధను, వేదనను కలిగించినది. అయితే వారు దానిలో నుండి దేవుని సహాయముతో విడిపించబడి దీవెనకరమైన వారిగా రూపాంతరం చెందటం జరిగింది.

కీర్తనాకారుడైన దావీదు కీర్తనలు 69:20లో ఇలా అంటున్నాడు. **నిందకు నా**

**హృదయము బద్దలాయెను నేను బహుగా కృశించియున్నాను కరుణించువారికొరకు కనిపెట్టుకొంటినిగాని యెవరును లేకపోయిరి. ఓదార్చువారికొరకు కనిపెట్టుకొంటినిగాని యెవరును కానరారైరి.**

నిందకు తన హృదయం పగిలిపోయిందని తాను కృశించి పోతినని ఎవరైనా కరుణ చూపిస్తారేమో అని చూచినా ఎవ్వరు నాకు లేరు అని చెప్పుచున్నాడు. మన జీవితములో కూడా ఇలాంటి పరిస్థితులు సాధారణమైనవే. దావీదు పైన చెప్పిన మాటలను మనం చూస్తూ ఉంటే మనలో కొందరికి మన జీవితాన్ని గురించి చెప్పినట్లు అనిపిస్తుంది. కొన్ని కొన్ని పరిస్థితులలో అర్థము చేసుకునేవారు, గ్రహించేవారు ఎవ్వరూ కనిపించకపోవటం చాలా సాధారణమైన విషయం. **నేను ఏకాకిని, బాధపడువాడను, నా వైపు తిరిగి నన్ను కరుణింపుము - కీర్తన 25:16**

అయితే ఒంటరితనం  ఎంత బాధిస్తుందో, అదే ఒంటరితనంలో నుండి సమాజానికి ఎంతో ఉపయోగకరమైన కార్యములను దేవుడు తన భక్తుల ద్వారా చేయించుకోవడం జరిగింది. బైబిల్‌లో చివరి గ్రంథమైన ప్రకటనలో ఎన్నో అద్భుత సత్యములను అపొ.యోహాను ద్వారా దేవుడు వ్రాయించాడు. ఆ గ్రంథమును వ్రాసిన సమయంలో యోహానును ఎవ్వరితోను మాట్లాడనివ్వకూడదని పత్మాసు ద్వీపములో బంధించడం జరిగింది. ఆ ఒంటరితనం కోటానుకోట్ల మంది జీవితాలకు ప్రయోజనకరముగా మారింది. అలాగే అపొ.పౌలు తన చివరి దినములలో జైలులో గడపడం జరిగింది. అక్కడ నుండి ఉత్తరములు వ్రాస్తూ, **నేను మొదట సమాధానము చెప్పినప్పుడు ఎవడును నా పక్షముగా నిలువలేదు, అందరు నన్ను విడిచిపోయిరి -2 తిమోతి 4:16** అని చెప్పడం జరిగింది.

అందరు తనను విడిచి పోయిరి అని చెప్పడం మనం చూస్తున్నాం. ఒంటరితనముకు వాళ్ళు వీళ్ళు అనే తేడా ఏమీ ఉండదు, అందరి జీవితంలో ఏదో ఒక సమయంలో ఈ పరిస్థితుల గుండా వెళ్ళవలసినవారే అయితే ముఖ్యముగా దేవుని దృష్టిలో, మనుష్యుల దృష్టిలో గొప్ప వారైన వ్యక్తులలో సహితము ఈ అనుభవముల గుండా వెళ్ళడం మనం గమనించవచ్చు. గొప్ప గొప్ప పురుషులు, స్త్రీలు ఎందరో వారి జీవిత అనుభములలో వాటిని ప్రస్తావిస్తూ ఉంటారు.మిషనరీ పితామహుడు అని పిలుచుకొనే విలియం కేరీ జీవితంలో ఇంటి నుండి దూరంగా వచ్చి, ఎంతో కష్టపడి, చివరికి తన కష్టమంతటితో సంపాదించిన ప్రింటింగ్ మిషన్ కాలిపోయినప్పుడు, ఎవ్వరు తన పరిస్థితులను అర్థం చేసుకునేవారు లేని భయంకరమైన ఒంటరితనంలో ఉన్నప్పుడు దేవుని మహా కృప వలన కాపాడబడి నేడు కొన్ని కోట్ల మందికి వారి మాతృ భాషలో బైబిల్ చదువుకునే అవకాశాన్ని



కలిగించాడు. **నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును - యోహాను 14:16**లో వ్రాయబడినట్లుగా మన కొరకు ఎల్లప్పుడూ, అన్ని పరిస్థితులకు సరిపోయిన ఆదరణకర్త ఉండుట మన ధన్యత. లోకంలో ఉన్న మరి ఎవ్వరికి లేని భాగ్యము క్రీస్తునందు విశ్వసించిన వారికి ఆయన అనుగ్రహించాడు.

కాబట్టి ప్రియమైన దేవుని పిల్లలారా మీ జీవితంలో మీరు ఎలాంటి పరిస్థితులలో ఉన్నప్పటికీ అధైర్యపడకండి. ఒంటరితనం అనేది దేవుడు లేనివారికి భయంకరమైనది కాని దేవుని తెలుసుకొని ఆయనను అంగీకరించిన మనకు మేలుగా, క్షేమముగా ఆశీర్వాదముగా మార్చబడింది. ఆయన భక్తులైన ప్రతి ఒక్కరు ఒంటరితనములో నుండి లోకానికి ప్రయోజనకరమైన కార్యములు చేసేవారిగా మార్పు చెందినారు.

నీ జీవితమునకు దేవుడు అట్టి కృప దయచేయును గాక !

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

---

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

---

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# బైబిల్‌లోని దీర్ఘాయుష్మంతులు

| | | | | |
|---|---|---|---|---|
| 1. | ఆదాము | - | 930 సంవత్సరములు జీవించెను. | ఆది 5:5 |
| 2. | షేతు | - | 912 సంవత్సరములు జీవించెను. | ఆది 5:8 |
| 3. | ఎనోషు | - | 905 సంవత్సరములు జీవించెను. | ఆది 5:11 |
| 4. | కేయినాను | - | 910 సంవత్సరములు జీవించెను. | ఆది 5:14 |
| 5. | మహలలేలు | - | 895 సంవత్సరములు జీవించెను. | ఆది 5:17 |
| 6. | యెరెదు | - | 962 సంవత్సరములు జీవించెను. | ఆది 5:20 |
| 7. | హనోకు | - | 365 సంవత్సరములు జీవించెను. | ఆది 5:23 |
| 8. | మెతూషెల | - | 969 సంవత్సరములు జీవించెను. | ఆది 5:27 |
| 9. | లెమెకు | - | 777 సంవత్సరములు జీవించెను. | ఆది 5:31 |
| 10. | నోవహు | - | 950 సంవత్సరములు జీవించెను. | ఆది 9:29 |
| 11. | షేము | - | 600 సంవత్సరములు జీవించెను. | ఆది 11:10,11 |
| 12. | అర్పక్షదు | - | 438 సంవత్సరములు జీవించెను. | ఆది 11:12,13 (షేము యొక్క కుమారుడు) |
| 13. | షెలహు | - | 433 సంవత్సరములు జీవించెను. | ఆది 11:14,15 |
| 14. | ఏబెరు | - | 464 సంవత్సరములు జీవించెను. | ఆది 11:16,17 |
| 15. | పెలెగు | - | 239 సంవత్సరములు జీవించెను. | ఆది 11:18,19 |
| 16. | రయూ | - | 239 సంవత్సరములు జీవించెను. | ఆది 11:20,21 |
| 17. | సెరూగు | - | 230 సంవత్సరములు జీవించెను. | ఆది 11:22,23 |
| 18. | నాహోరు | - | 148 సంవత్సరములు జీవించెను. | ఆది 11:24,25 |
| 19. | తెరహు | - | 205 సంవత్సరములు జీవించెను. | ఆది 11:32 |
| 20. | శారా | - | 127 సంవత్సరములు జీవించెను. | ఆది 23:1 |
| 21. | అబ్రాహాము | - | 175 సంవత్సరములు జీవించెను. | ఆది 25:7 |
| 22. | ఇష్మాయేలు | - | 137 సంవత్సరములు జీవించెను. | ఆది 25:17 |
| 23. | ఇస్సాకు | - | 180 సంవత్సరములు జీవించెను. | ఆది 35:28 |
| 24. | యాకోబు | - | 147 సంవత్సరములు జీవించెను. | ఆది 47:28 |
| 25. | యోసేపు | - | 110 సంవత్సరములు జీవించెను. | ఆది 50:26 |
| 26. | మోషే | - | 120 సంవత్సరములు జీవించెను. | ద్వితీయో 34:7 |
| 27. | యెహోషువ | - | 110 సంవత్సరములు జీవించెను. | యెహోషు 24:29 |

# " నిర్ణయము "

- సిస్టర్ వి. విజయ

అబ్రాము తన తండ్రి ఇంటి నుండి బయలుదేరి, ప్రయాణమై పోవుచూ, ఐగుప్తు అనే దేశములో నివసించవలసి వచ్చినప్పుడు చక్కనిదైన తన భార్య శారయి నిమిత్తము అతనిని చంపుదురేమోనని భయపడి ఆమెను తన సహోదరిగా చెప్పెను. అప్పుడు ఐగుప్తు రాజైన ఫరో యొక్క అధిపతులు ఆమెను చూచి రాజు ఎదుట ఆమెను పొగిడిరి గనుక శారయి ఫరో ఇంటికి తేబడెను. శారయి తన దగ్గర ఉన్న సమయములో రాజైన ఫరో అబ్రాముకు గొర్రెలను, గొడ్లను, దాసులను, పనికత్తెలును, ఆడగాడిదలును, ఒంటెలను కానుకగా పంపించెను. ఆ దాసదాసీలలో ఐగుప్తీయురాలైన హాగరు ఒకరు. తరువాత శారయిని బట్టి ఫరో ఇంటి వారిని రోగములతో యెహోవా బాధించినందున తిరిగి శారయిని అబ్రాము దగ్గరకు పంపించివేసాడు.

అబ్రాము భార్య శారా అతనికి సంతానాన్ని కనలేదు. బైబిల్ గ్రంథములో ఆదికాండము 16:2 లో చెప్పబడినట్లుగా శారయి– " ఇదిగో నేను పిల్లలు కనకుండా యెహోవా



చేసియున్నాడు. నీవు దయచేసి నా దాసితో పొమ్ము. ఒకవేళ ఆమె వలన నాకు సంతానము కలగవచ్చునని అబ్రాముతో చెప్పెను. అబ్రాము శారయి మాట విన్నాడు. శారయి తన దాసియైన హాగరును అబ్రాముకు భార్యగా ఇవ్వటానికి సిద్ధపడింది, ఇచ్చేముందు దేవుని యొక్క ఉద్దేశ్యము ఏమై ఉన్నదో కనిపెట్టక స్వంత ఆలోచనలతో నిర్ణయము తీసుకుంది. అబ్రాము కూడా వేరొక స్త్రీని నేను భార్యగా చేసుకొనవచ్చునా? అని ఆలోచించకుండా తీసుకున్న నిర్ణయము అనేక సమస్యల్ని తెచ్చింది.

మన కుటుంబములో ఏదైనా సమస్య కలిగినపుడు భార్యాభర్తలిద్దరూ సంప్రదించుకొని దేవుని సన్నిధిలో ప్రార్థించి ఒక నిర్ణయమును తీసుకోవాలి. దేవుని చిత్తమును తెలుసుకోకుండా తీసుకునే నిర్ణయములు అనేక అనర్థములను తెచ్చిపెడతాయి.

హాగరు ఒక దాసీ. ఎప్పుడైతే ఆమె అబ్రాముకు భార్యగా ఇయ్యబడి గర్భము ధరించినదో అప్పుడే ఆమె శరీరములో గర్భముతో పాటు హృదయములో గర్వము ప్రవేశించింది. ఆమె ఉన్న స్థితికి కారణమైన యజమానురాలిని నీచదృష్టితో చూడసాగింది.

గర్వము అనేది సాతాను యొక్క లక్షణము. నేను అనేక సంవత్సరముల నుండి

దేవునిలో ఉన్నాను, మంచి ప్రార్ధనా పరురాల్ని, అందరి కంటే వాక్యము బాగా చదువుతాను కనుక నేను గొప్పదానిని అనే ఆత్మీయ గర్వముతో కొందరు, మరికొందరు చదువు, అందము, ధనము, సమాజములో తాము ఉన్న హోదాని బట్టి గర్వము ప్రదర్శిస్తూ ఉంటారు. బైబిల్ గ్రంథములో సామె 16:5 లో చెప్పబడినట్లుగా గర్వహృదయులందరూ యెహోవాకు హేయులు. నిశ్చయముగా వారు శిక్షనొందుదురు. మనము ఏ విషయములో నైననూ గర్వించి, మాటలలోనూ, క్రియలలోనూ అహంకారమును ప్రదర్శించి దేవుని శిక్షకు పాత్రులము కాక, వినయ, విధేయతలు కలిగి కృతజ్ఞతా హృదయముతో జీవించుట వలన మాత్రమే దేవుని ఆశీర్వాదమును పొందగలము. ఎందుకనగా యాకోబు 4:6 లో చెప్పబడినట్లుగా దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. దీనత్వము కలిగి ఉండుట వలన ఆయన కృపను పొందుకోగలము.



హాగరు గర్వహృదయమును బట్టి యజమానురాలు అయిన శారయి ఆమెను శ్రమ పెట్టినందున హాగరు శారయి యొద్దనుండి అరణ్యము లోనికి పారిపోయెను. అరణ్యములో యెహోవా దూత హాగరుని కనుగొని ఎక్కడ నుండి వచ్చితివి, ఎక్కడికి వెళ్ళుచున్నావని అడిగినందుకు ఆమె – నా యజమాను రాలైన శారయి యొద్ద నుండి పారిపోవుచున్నా ననెను, అప్పుడు యెహోవాదూత – నీ యజమానురాలి యొద్దకు తిరిగి వెళ్ళి ఆమె చేతి క్రింద అణిగి యుండమని ఆమెతో చెప్పెను. ఆది 16 :8,9 హాగరు గర్వ హృదయముతో పారిపోయి వచ్చిననూ, దేవుడు ఆమెను కనుగొని, ఆ హృదయమును విడిచి జీవించమని చెప్పి ఆమె సంతతిని విస్తరింపచేసి, ఆశీర్వదిస్తాను అన్నారు. మనము ఎటువంటి స్వభావమును, ఎంత చెడ్డహృదయమును కలిగి, క్రియలు భయంకరముగా ఉన్నను, దేవుడు మనలను కనుగొని పిలిచి వాటన్నిటి నుండి విడిపింపచేసి, ఆశీర్వాదమును కలుగచేస్తారు.



అప్పుడు హాగరు వెనుకకు తిరిగి వెళ్ళి తన యజమానురాలి క్రింద అణిగి జీవించుచూ, కుమారుని కని ఇష్మాయేలను పేరు పెట్టి పెంచసాగెను. దేవుడు అబ్రాహాముకు వాగ్దానము చేసినట్లుగా శారా యొక్క గర్భమును తెరిచి ఇస్సాకుని అనుగ్రహించారు. ఇస్సాకు , ఇష్మాయేలు పెరిగి పెద్దవారగుచుండగా, ఇష్మాయేలు, ఇస్సాకును హేళన చేసి

అబ్రాహాము ఇంటి నుండి వెళ్ళగొట్టబడిరి.

హాగరు తన కుమారుడైన ఇష్మాయేలుతో బెయేర్షెబా అరణ్యములో ఇటు అటు తిరుగుచుండెను. తిత్తిలోని నీళ్ళు అయిపోయిన తరువాత ఆమె ఒక పొద క్రింద ఆ చిన్నవాని పడవేసి ఈ పిల్లవాని చావు నేను చూడలేనని అనుకొని, వింటివేత దూరము వెళ్ళి అతని కెదురుగా కూర్చుండెను. ఆమె ఎదురుగా కూర్చుండి వెక్కివెక్కి యేడ్చెను. అయితే దేవుడు ఆ చిన్నవాని మొరను వినినట్లుగా ఆది 21:17 లో చెప్పబడినది.



అప్పుడు దేవుని దూత ఆకాశము నుండి హాగరుని పిలిచి, హాగరూ నీకేమి వచ్చినది? భయ పడకుము, ఆ చిన్నవాడున్న చోట దేవుడు వాని స్వరము వినియున్నాడు. నీవు లేచి ఆ చిన్నవాని లేవనెత్తి నీ చేత పట్టుకొనుము. వానిని గొప్ప జనముగా చేసెదనని ఆమెతో అనెను.

హాగరు దేవుని మాట ప్రకారము తాను కూర్చున్న స్థితి నుండి లేచినప్పుడు, దేవుడు ఆమె కన్నులు తెరిచినందున ఆమె నీళ్ళ ఊట చూచి వెళ్ళి ఆ తిత్తిని నీళ్ళతో నింపి చిన్నవానికి త్రాగనిచ్చెను. కొన్నిసార్లు మన పరిస్థితులు మనలను ఏ పనీ చేయకుండా క్రుంగిన స్థితిలోకి తీసుకువెళతాయి. మనకు కష్టములు రావడం సహజం అయితే నా బ్రతుకు ఎందుకిలా అయింది? అని చింతిస్తూ కూర్చుండక, కష్టముల కంటే మన జీవితము విలువైనది అని ధైర్యము తెచ్చుకొని జీవించాలి. అంతమాత్రమే కాక క్రుంగిన వారిని ధైర్యపరిచే వారిగా ఉండాలి.

ప్రియసహోదరీ ! శారయి, అబ్రాహాము తీసుకొనిన నిర్ణయములు అనేక సమస్యలను తెచ్చాయి. హాగరు మొదట గర్వించి శారాని నీచమైన దృష్టితో చూచిననూ మరల దేవుని మాటకి లోబడి తిరిగి వెళ్ళి హృదయము మార్చుకొని జీవిస్తూ కుమారుణ్ణి మరణము నుండి కాపాడుకోగలిగింది.

మన జీవితములో సరియైన నిర్ణయములు తీసుకోవటమే కాకుండా, మన స్థితిని బట్టి గర్వించక, ఎదిగిన కొద్ది ఒదిగి జీవించాలి. అట్టి ధన్యత దేవుడు మనకి అనుగ్రహించును గాక!

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర



**- సీరియల్ 34వ భాగము**

ఆకస్మికముగా తన ఆత్మ నేత్రములు తెరువబడినవా అన్నట్లుగా దేవుని రాజ్యములోని మహిమలను చూచాడు సుందర్. యాకోబు తన కలలో నిద్రించుచున్న స్థలం నుండి దేవదూతలు పరలోకంలోని దేవుని యొద్దకు దిగుచు ఉండినారు. ఇంతేగాక హెబ్రీ 12:22-24 "ఇప్పుడైతే సీయోనను కొండకును, జీవముగల దేవుని పట్టణమునకు అనగా పరలోకపు యెరూషలేమునకును, వేవేల కొలది దేవదూతల యొద్దకును, పరలోకమందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘమునకును వారి మహోత్సవమునకును, అందరి న్యాయాధిపతియైన దేవుని యొద్దకును, క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన యేసు నొద్దకును, హేబేలు కంటె మరి శ్రేష్టముగ పలుకు ప్రోక్షణ రక్తమునకు మీరు వచ్చియున్నారు. అని వ్రాయబడిన ఈ వచనములు తన కళ్ళ యెదుట వాస్తవ రూపం దాల్చడాన్ని సుందర్ చూచాడు. దీనిని వర్ణించనలవి కాదు. ఆ తరువాత సంవత్సరములలో దీనిని ఎంతో శ్రేష్టమైన రీతిగా, వివరించాడు సుందర్. ఈ లోకములో సౌందర్య చిహ్నాలుగా ఎంచబడేవెన్నో అక్కడ కూడా ఉన్నాయి. పర్వతాలు, వృక్షాలు, పుష్పాలు అక్కడ ఉన్నాయి. అయితే అవి లోపరహితంగా ఉన్నాయి. అవి పరిపూర్ణ సౌందర్యాన్ని సంతరించుకున్నాయి. ఈ భూలోకములో ఉన్న పర్వతాలు, వృక్షాలు, పుష్పాలు ఇవన్నీ పరలోకములో నేను చూచిన వాటి ఛాయ మాత్రమే. అక్కడ నున్న సమస్తము, అంటే నిర్జీవ వస్తువులు సహా వాటంతటవే నిరాటంకంగా దేవుని స్తుతించుచున్నాయి. వీటన్నిటి మధ్య వర్ణనాతీతమైన రూపము గలవాడై సింహాసనాసీనుడైన క్రీస్తును చూచాను. మారుమనస్సు పొందే సమయములో నా భౌతికనేత్రములతో చూచిన ఆ మోమే ఇప్పుడూ నా ఆత్మ నేత్రములకు కనబడుచున్నది. ఆయనకు ఉన్న గాయముల నుండి రక్తం స్రవించుచున్ననూ ఆ గాయములు అసహ్యంగా లేవు గాని ప్రకాశిస్తూ శోభాయ మానంగా ఉన్నాయి. ఆయనకు గడ్డమున్నది. పొడవుగా ఉన్న ఆయన తల వెంట్రుకలు సువర్ణమును పోలి మెరయు చుండినవి. ఆయన ముఖం సూర్యకాంతిని పోలియున్నది గాని ప్రకాశమైన ప్రేమ పూరితమైన చిరునవ్వుతో ఆ ముఖమెంతో సౌందర్యంగా ఉన్నది. క్రీస్తు ఏ మాత్రము భయము కలిగించే వానిగా లేదు. ఆయన సింహాసనము చుట్టును అనంత దూరం వరకు మహిమాన్వితమైన

పరలోకవాసులను చూచాను. వారిలో కొందరు పరిశుద్ధులైతే, మరికొందరేమో దూతలు, అయితే ఎవరు దూతలో, ఎవరు పరిశుద్ధులో గుర్తించడం మాత్రం కష్టమే. వీరి మధ్య తేడా ఏమనేది ప్రాముఖ్యం కాదు. ఇచ్చట మేమందరం ఒకటే అని వారు నాతో అన్నారు. వీరందరూ యేసుప్రభువు తమ్ముళ్ళవలే ఉన్నారు. వీరందరు మహిమలో ఉన్నవారే గాని క్రీస్తు ప్రభువు మహిమ వీరందరి మహిమను మించిపోయింది. అంతేగాక వీరి మధ్యలో కూడా ఒకరి మహిమకు మరొకరి మహిమకు తేడా ఉన్నది. వారి వస్త్రములు వెలుగుతో నేయబడినట్లుగా ఉండి ఎన్నో రంగులతో ప్రకాశిస్తుండినాయి గాని కళ్ళు చెదిరిపోలేదు. భూలోకములో లేని ఎన్నెన్నో రంగులు ఇక్కడున్నాయి. ఇక్కడున్న వాటంత సౌందర్యవంతమైనవి భూలోకములో లేనే లేవు. వజ్రాలు, మంచి ముత్యములు సైతం అక్కడ ఎందుకు పనికిరావు. వారు నాతో మాట్లాడుచున్నపుడు ఒక్క క్షణములో తమ తలంపులను నాలో ఉంచారు. ఆత్మల లోకములో నేను భాష నేర్చుకోవలసిన అవసరం రాలేదు. క్రొత్తగా జన్మించిన శిశువుకు ఊపిరి పీల్చుకోవడం అంతకు ముందు అలవాటు లేకున్ననూ, భూలోకములోనికి వచ్చిన వెంటనే ఎలా ఊపిరి పీల్చుతుందో అలాగే శరీరమును విడిచి ఆత్మల లోకములోనికి ప్రవేశించగానే అచటి భాషను మనం సులువుగా మాట్లాడతాము. ఈ దర్శనములలో ఎంతో అద్భుతమైన సంభాషణలు జరుగుతాయి. అపొస్తలుల విశ్వాస ప్రమాణములో చెప్పబడిన దానిని పరిశుద్ధులు ఇచ్చట మాట్లాడుచుంటారు. ఆత్మ సంబంధమైన విషయములను గూర్చి, సమస్యలను గూర్చి మనం మాట్లాడుచుంటాము. భూలోకములో వాటిని ఎవ్వరూ తీర్చలేరు. అయితే పరిశుద్ధులు, దూతల సమూహము వాటిని తేలిగ్గా తీర్చగలరు. ఆత్మల లోకములో నేను చూడగలుగుచూ, వినగలుగుచూ ఉన్న ఎన్నో విషయములు ఉన్నాయి. వాటిని గురించి నా హృదయములో నిర్దిష్టమైన అవగాహన ఉన్నది గాని నా మాతృభాషలో కూడ నేను వాటిని వివరించలేను. ఆంగ్లభాషలో వివరించాలంటే మరింత కష్టమన్న సంగతి వేరే చెప్పనక్కర్లేదు. అంతేకాక అచటి వాటిలో కొన్నింటిని గూర్చి అసలు చెప్పకూడదు. చెప్పినట్లైతే వాటి రమ్యత తగ్గిపోతుంది.

సేకరించబడింది

(ఇంకా ఉంది)



# సంక్షోభ సమయములో

Hai పిల్లలూ ! ఎలా ఉన్నారు? Holidays కదా బాగా Enjoyచేస్తున్నారా? కొందరైతే క్రొత్త క్రొత్త ప్రదేశాలు చూడాలని ఉవ్విళ్లూరుతూ ఉంటారు. Holidays Enjoy చేయాలని ప్రతి విద్యార్థి కోరుకుంటాడు. బంధువుల ఇంటికి వెళ్ళి చేసే అల్లరి, ఆటపాటలు క్రొత్త స్నేహాలు ఇవి అన్నీ sweet memoriesగా మిగిలి పోతాయి. ఇకపోతే కొందరు తెలివిగల వాళ్ళు ఈ summerలో Bible study అనీ Quiz Competitions అని వాళ్ళ friendsకి దేవుని గురించి Practicalగా చూపించాలని చాలా సాహసం చేస్తారు. అలాంటి మిత్రుల గురించి తెలుసుకుందాము !

సుధీర్, రాజు, అభి, గణేష్ ఆప్త మిత్రులు. ఒకే తరగతి కూడా! స్కూల్‌లోనూ ప్లేగ్రౌండ్‌లోనూ కలిసే ఉంటారు. సెలవుల్లో నదికి వెళ్లి స్నానం చేసి రావాలని plan వేసుకొని, ఆ Date కూడా నిర్ణయించుకున్నారు. నలుగురూ సైకిళ్లమీద బయలుదేరారు. నది దగ్గరకి చేరుకున్నారు. అభి ఆలోచనలో పడ్డాడు. ఎన్నాళ్ళ నుండో తనకి అత్యంత ప్రియమైన గణేష్‌కు యేసుక్రీస్తు గురించి చెప్పాలనుకుంటూనే వాయిదా వేస్తున్నాడు. గణేష్ ఒక్కడికే యేసుక్రీస్తు గురించి తెలియదు, మిగిలిన ముగ్గురూ క్రైస్తవులే. రెగ్యులర్‌గా సండేస్కూల్‌కి వెళతారు. గణేష్ కూడా వాళ్ళతో సండే స్కూల్‌కి రావాలని అభి యొక్క కోరిక, ఎన్నిసార్లు అడిగినా ఏదో సాకు చెప్పి గణేష్ తప్పించుకునేవాడు. పైగా క్రీస్తును గూర్చి చులకనగా మాట్లాడేవాడు. "ప్రభువా! నాకో మార్గం చూపించు" అంటూ కదిలాయి అభి పెదాలు.

సైకిళ్ళు ఒకచోట భద్రంగా నిలబెట్టి తాళాలు వేసి, నడుచుకుంటూ నది వైపుకి నడిచారు. నీళ్ళ దాకా వెళ్ళగానే గణేష్ సంచిలోంచి రబ్బరుదేదో తీసి బలవంతంగా దానిలోకి గాలి ఊదడం మొదలుపెట్టాడు. "అదేంట్రా?" అభి అడిగాడు. కొంచెమాగమని చేతితో సైగచేస్తూ తన పని కొనసాగించాడు. తీరా అది గాలితో నిండిన తరువాత, అదేమిటో చెప్పనక్కర లేకుండానే అందరికీ అర్థమయింది. "ఇదెందుకు తెచ్చావ్" సుధీర్ అడిగాడు. "ఎందుకేమిటి నేను రెగ్యులర్‌గా Swimming Phoolకి వెళ్ళేవాణ్ని తెలియదా? అప్పుడప్పుడూ దాని మీదకెక్కి పడుకొని తేలుతూ ఉంటే భలే మజాగా ఉంటుంది. ఆ మాత్రం తెలియదా!" అంటూ వారివైపు చూశాడు గణేష్.

అందరూ పందేలు వేసుకుంటూ ఈత కొడుతున్నారు. సుధీర్‌కి, రాజుకి ఈత

అలవాటే. అభీకి స్విమ్మింగ్ అనుభవముంది. గణేష్‌కి Rubber Tube Safetyగా ఉంది, అయినా వెనుకబడి పోతున్నాడు గణేష్, అభి గమనిస్తూనే ఉన్నాడు. హఠాత్తుగా గణేష్ కనిపించకుండా పోయాడు. అభి వెతుకుతున్నాడు... గణేష్ తల మాత్రమే తేలుతున్న తాటి బుర్రలా కనబడింది. అభి అదిరిపడ్డాడు. గణేష్ మెడకు తగిలించుకున్న ట్యూబ్ ఏమయ్యిందో కనిపించలేదు.

"అయ్యో! ప్రభువా? నా మిత్రుడ్ని రక్షించు" అంటూ ఇంకా ఆలస్యం చేయకుండా అభి నీటిలో ఈదుకుంటూ గణేష్‌ను ఒడ్డుకి లాక్కొచ్చాడు, ఇంతలోకి సుధీర్, రాజు వచ్చి ప్రథమ చికిత్స చేశారు. అభి పూర్తిగా అలసిపోయాడు, "ప్రభువా! నీకు స్తోత్రం" అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు. గణేష్‌కి స్పృహ వచ్చింది. మెల్లగా కళ్ళు తెరచి, పరిసరాలవైపు చూస్తు, లేచి కూర్చున్నాడు. "చాలా Thanksరా అభీ!" చనిపోవలసిన నన్ను కాపాడావు" అతని కళ్ళు చెమర్చాయి. తప్పు గణేష్! Thanks చెప్పాల్సింది నాక్కాదు. ఆ ప్రభువైన క్రీస్తుకు".

అదేమిటనట్టు వారివైపు ఆశ్చర్యంగా చూశాడు గణేష్. "నిన్ను ఒడ్డుకు చేర్చాలనే ప్రయత్నంలో కొంత దూరము వచ్చాక నేను శక్తి కోల్పోయాను. ఇక నీకు ఏ సహాయమూ చేయలేని స్థితికి వచ్చాను. సుధీర్, రాజు మనల్ని గమనించలేదు ప్రమాదంలో ఉన్నామని పసిగట్టలేదు. ప్రభువే నాకు మరికొంత బలమిచ్చి మన ఇద్దరినీ భూమిపైన నిలిపాడు. మనమందరమూ ఆయనకే కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి." అంటూ చెప్పాడు అభి.

గణేష్‌కు వెనుకటి సంగతులు గుర్తుకొచ్చాయి ఈ నాటి దుర్ఘటనతో వాటిని తలుచుకుంటూ తలదించుకున్నాడు. "అభీ! నన్ను సండేస్కూలుకు రమ్మని ఎన్నోమార్లు బలవంత పెట్టావు. నేనే లెక్క చేయలేదు. ఇప్పుడు నాకు తెలిసింది. తప్పకుండా వస్తాను. నీ క్రీస్తును నా రక్షకునిగా అంగీకరిస్తాను." అని గణేష్ అంటుంటే ఆ మిత్రులు మైమరచిపోయారు. అందరూ కలిసి ప్రభువుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించారు.

చూశారా పిల్లలూ, వాళ్ళందరూ కలసి ఎంత సంతోషంగా Summer సెలవులు గడిపారో దేవుని గురించి తెలియని స్నేహితుడిని ఏ విధంగా రక్షించుకున్నారో, మరి మీరు కూడా దేవుని గురించి తెలియని స్నేహితులను దేవుని సహాయం వలన మీ మిత్రులను రక్షించుకోవాలని మా కోరిక.

మీ అక్కయ్య....

 సోమరితనాన్ని మించిన సన్నిహిత శత్రువు మరొకటి లేదు.

# “నా జీవితములో దేవుని మేలులు”

పాల్ ప్రవీణ్, అద్దంకి

దేవుని నామములో మీ అందరికి నా వందనములు. నా పేరు పాల్‌ప్రవీణ్, నేను పుట్టి, పెరిగింది ప్రకాశం జిల్లా అద్దంకి మండలములోని చెరువుకొమ్ము పాలెములో. మాది విగ్రహారాధన కుటుంబము. నేను ఐదవ తరగతి చదువుతున్నప్పుడు మా నాన్నకు, అమ్మమ్మకు మధ్య ఎప్పుడూ గొడవలు జరుగుతూ ఉండుట వలన మా నాన్న ఇల్లు వదిలి ఎటో వెళ్ళిపోయాడు. అదే సమయములో మా ఇంటి ప్రక్కన, తెలిసిన వాళ్ళ అబ్బాయి క్రొత్తగా కీబోర్డ్ కొని నేర్చుకుంటూ ఉండగా నేను చూసేవాడిని. అప్పుడు నాకు కూడా దానిని నేర్చుకోవాలి అనే ఆసక్తి బాగా కలిగింది. కాని ఇంట్లో పరిస్థితి బాగాలేదు, ఏం చేయాలి ? అని ఆలోచిస్తూ ఆ కీబోర్డ్ నేర్చుకునే అబ్బాయి దగ్గరకి వెళ్ళి బ్రతిమాలి, బేసిక్స్ తెలుసుకొని ఆ బాక్స్ మీద ఉన్న కీబోర్డ్ బొమ్మ మీద కొన్ని రోజులు ప్రాక్టీస్ చేశాను. తరువాత ఇంట్లో అమ్మని, తాతయ్యని బ్రతిమలాడి, గట్టిగా పట్టుపట్టి 1000/- రూ లు పెట్టి ఒక చిన్న కీబోర్డ్‌ని కొనిపించుకొని, నేర్చుకోవడానికి రోజూ వేరే ఊరు వెళ్ళేవాడిని. అదే సమయములో ఒక టీచర్ ట్రాన్స్‌ఫర్ మీద మా ఊరికి వచ్చి, మా ఇంటి ప్రక్కనే అద్దెకు ఉండేవారు. వారు యేసుక్రీస్తుని నమ్ముకున్నవారు కావడం వలన దేవుడి గురించి మా అమ్మకు చెప్పేవాళ్ళు. మా అమ్మ మెల్లగా విగ్రహారాధన అంతా వదిలేసి, మారుమనస్సు పొంది, బాప్తిస్మము తీసుకుంది. నాకు, తమ్ముడికి దేవుడి గురించి చెప్తూ మమ్మల్ని కూడా తనతో పాటు మందిరముకి తీసుకొని వెళ్ళేది కానీ ఎలా జీవించాలో ఏమీ తెలిసేది కాదు. అప్పుడు నేను చదువు కూడా మానేసి కీబోర్డ్ నేర్చుకునే పనిలో బిజీగా తిరుగుతూ చిన్నచిన్న ఫంక్షన్స్‌కి, మ్యారేజెస్‌కి ప్లే చేస్తూ ఉండేవాడిని. తరువాత నా జీవితములో ఎన్నో మార్పులు జరిగి, మలుపులు తిరిగి, ఒక వ్యక్తి ద్వారా హైదరాబాద్ రామోజీ ఫిలింసిటీలో మ్యూజిక్ హెల్పర్‌గా జాయిన్ అయ్యాను. అప్పుడు నాకు అంతా వింతగానూ, క్రొత్తగానూ చాలా గొప్పగానూ ఉండేది. చదువు, జ్ఞానము తక్కువ, మా ఊరు తప్ప సిటీ తెలియని వాడిగా ఉన్న నేను కలలో, ఊహలో కూడా లేని ప్రపంచములోనికి వచ్చినప్పుడు ఇది శాశ్వతంగా ఉంటుందో, లేదో అని చిన్న భయం కూడా ఉండేది. అప్పుడు నాకు 1500/- రూ జీతం. అదే సమయములో ఒకరోజు బస్‌లో మన పరిచర్యలోని ఒక బ్రదర్ పరిచయమయ్యారు. ఆయన దేవుడి గురించి, తాను వెళుతున్న చర్చి గురించి చెప్పేవారు. తరువాత ఒక ఆదివారం ఆ బ్రదర్‌తో పాటు చర్చికి వెళ్ళాను. అక్కడ 25 నుండి 30 మంది ఉన్నారు. దైవసేవకులు చెప్పిన వాక్యం నాకు బాగా అర్థమై, నా గురించే చెబుతున్నట్లుగా అనిపించేది. అలా నేను క్రమముగా చర్చికి వెళ్తుండగా, చర్చిలో చెప్పే సాక్ష్యాలు విన్నప్పుడు వాళ్ళు చేసిన మిస్టేక్స్‌ని అందరి ముందు ధైర్యంగా

చెప్పుకుని, దేవుడు వాళ్ళని ఎలా రక్షించాడో చెప్పినప్పుడు ఆ సాక్ష్యాలు, దైవసేవకుల వాక్యము ద్వారా నేనేమిటో తెలుసుకొని మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము తీసుకున్నాను. పరిచర్యలో కీబోర్డ్ ప్లే చేస్తూ ఎక్కడ మీటింగ్ జరిగిననూ మిస్ కాకుండా వెళ్ళేవాడిని. ఎంతోమంది జీవితములను భయంకరమైన పరిస్థితుల నుండి దేవుడు విడిపించి, రక్షించడం చూసి, చెప్పలేనంత సంతోషం కలిగేది. ఎన్నో సౌఖ్యములు ఉన్ననూ వాటన్నిటిని కాదని ఉన్న ఒక్క జీవితము దేవుని కోసం జీవించుచూ, నిస్వార్ధముగా బ్రతుకుతున్న దైవసేవకులను చూచినప్పుడు, నాకు చావైనా, బ్రతుకైనా చివరి శ్వాస వరకు దేవునిలోనూ, పరిచర్యలోనూ బ్రతకాలనే ఆశ కలిగింది. ఎలాంటి అర్హత లేని నాకు పరిచర్యలో అప్పగించిన కీబోర్డ్ ప్లే చేసే పనిని ధన్యతగా భావించుచూ, నమ్మకముగా పని చేయాలని ముందుకు కొనసాగుతున్నాను.

తరువాత నా వివాహ విషయములో దేవుడు సహాయం చేసి మంచి భార్యను అనుగ్రహించాడు. పిల్లల విషయములో కూడా నా భార్యకు కలిగిన బలహీనతల నుండి అద్భుతముగా స్వస్థపరిచి కుమారుడిని అనుగ్రహించారు. నేను చేస్తున్న పనిలో కూడా ఊహించని మేలులతో నడిపిస్తున్నారు. 1500/-లతో మొదలై ఇప్పుడు స్వంతంగా ఫిల్మ్ పోస్ట్ ప్రొడక్షన్ స్టూడియో పెట్టుకోవడానికి ఆయన కృపను చూపారు. నా జీవితములో జరిగినవన్నీ దేవుని ప్రణాళిక చొప్పున మాత్రమే జరిగాయి అని విశ్వసించుచున్నాను. చివరి శ్వాస వరకు ఇదే నమ్మకత్వం, విశ్వాసములతో పరిచర్యలో ముందుకి కొనసాగాలని మా కుటుంబము కొరకు ప్రార్ధించగలరు.


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

*అందరూ ఆహ్వానితులే....!*

**వివరములకు:**

9666666249 | 040-24202227

# విశ్వాసంలో ఎదుగుట

ప్రభువు బోధకుల్ని నియమించడంలో ఒక కారణం అవిశ్వాసాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికే. తాను యౌవన దశను గడిపిన నజరేతు పట్టణానికి యేసు వెళ్ళినప్పుడు **"ఏ అద్భుతమును ఆయన అక్కడ చేయజాలకపోయెను. వారి అవిశ్వాసమునకు ఆశ్చర్యపడెనని" (మార్కు 6:5) బైబిలు చెబుతున్నది.**

సామాజిక అవిశ్వాసం అనేది ఉంది. అది క్రీస్తుని అక్కడ పనిచేయకుండ నిరోధించింది. ఈ వ్యాఖ్యానాన్ని అనుసరించి మార్కు 6వ అధ్యాయములో **"ఆయన చుట్టుపట్ల నున్న గ్రామములు తిరుగుచూ బోధించుచుండెను"** అని సూటిగా వ్రాసి ఉంది. ఎందుకు? ఎందుకంటే ఉపదేశం లేక బోధ మాత్రమే అవిశ్వాసానికి విరుగుడు.

మనుష్యుల్ని ప్రేమించడం ద్వారా వారిలోని అవిశ్వాసాన్ని తొలగించలేము. దానికి నివారణ సరియైన ఉపదేశమే. కనుక విశ్వాసాన్ని గూర్చిన బోధ అవసరం. అంటే మనలో బయటపడేందుకు సిద్ధంగా ఉన్న విశ్వాసం గురించి, విశ్వాసపు ఎదుగుదలను కలిగించే సూత్రాల గురించీ, మరి ముఖ్యంగా మన విశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి అన్న దాని గురించి మనకు బోధన అవసరం.

యేసు విశ్వాసం గూర్చి ఎప్పుడు మాట్లాడినా, మనకు ఇతరులతో ఉన్న సంబంధాలతో దానికి లంకె పెడుతుంటాడు. విశ్వాసం ఎదగాలంటే, ఇతర విశ్వాసులతో మన సంబంధం ఎదగాలి.

**యేసు తన శిష్యులకు ఇలా బోధించాడు "మీ విషయమై మీరే జాగ్రత్తగా ఉండుడి. నీ సహోదరుడు తప్పిదము చేసిన యెడల అతని గద్దించుము. అతడు మారు మనస్సు పొందిన యెడల అతని క్షమించుము. అతడు ఒక దినమున ఏడు మారులు నీ యెడల తప్పిదము చేసి ఏడు మారులు నీవైపు తిరిగి - మారు మనస్సు పొందితిననిన యెడల అతని క్షమించవలెననెను" (లూకా 17:3,4)**

మానవ సంబంధాలకూ క్షమాపణను గూర్చిన ఈ బోధనకూ స్పందనగా అపొస్తలులు – "మా విశ్వాసము వృద్ధి పొందించుమని" ప్రభువును బ్రతిమాలుకున్నారు. మనకు అనుకూలురు కాని క్రైస్తవులతో సర్దుకు పోవడానికి విశ్వాసం అవసరం.

**విధేయత వలన విశ్వాసం ఎదుగుతుంది:**

విశ్వాసి జీవితంలో, విశ్వాసమెలా ఎదుగుతుందో మనమిప్పుడు కనుగొనాలి. మనం "విశ్వాసము నుండి విశ్వాసానికి", మహిమనుండి మహిమకు" ఎదుగుతాము.

మనం జ్ఞాపకముంచుకోవాల్సిన బైబిలు సూక్తి: మీ జీవితంలో ఎదుగుతున్న

విశ్వాసపు నిష్పత్తి చొప్పునే దేవుని మహిమను మీ జీవితంలో చూస్తారు. అభివృద్ధి చెందిన విశ్వాసం మీ జీవితంలోనూ, పరిచర్యలోను దేవుని మహిమను అధికంగా తెస్తుంది.

విశ్వాసపు ఎదుగుదల సూత్రాన్ని టుట్‌రాజు సమాధి కథలో దృష్టాంతీకరించవచ్చు. టుట్ రాజు (టుటాంక్ హమాన్ రాజు సంక్షిప్తనామం) ఐగుప్తు దేశంలో ప్రఖ్యాతి చెందిన ఫరో. క్రీ.పూ. 1357లో అతి పెద్దదైన పిరమిడ్‌లో అతన్ని సమాధి చేశారు. ఒక ఆంగ్లేయ పురావస్తు శాస్త్రజ్ఞుడు ఈ సమాధిని చెక్కు చెదరని స్థితిలో క్రీ.శ 1922లో కనుగొన్నాడు. ఆ సమాధి లోపల దొరికిన నిధులలో తేనె, గోధుమ, జొన్నలు కూడా ఉన్నాయి.

ఏమి జరుగుతుందో చూద్దామన్న కుతూహలంతో ఆ పురావస్తు శాస్త్రజ్ఞుడు ఆ 3,279 సంవత్సరాల క్రితంనాటి గోధుమ, జొన్నలను నైలునది సారవంతమైన భూమిలో నాటాడు. అక్కడ ఆ గింజలకు అవసరమైన తేమ, పోషక పదార్థాలు లభించాయి.

మామూలుగా పంట పండేంత కాలంలోనే ఆ గింజలనుండి ధాన్యం కోతకు వచ్చింది. 3,000 సంవత్సరాలు పాతబడిన గింజలు పంట పండాయి.

మూడున్నర వేల సంవత్సరాలు సుషుప్తావస్థలో వుండిన గింజల్లో శక్తి ఉన్నందున పంటను ఉత్పత్తి, పునరుత్పత్తి చేయగలిగాయి. ఆ గింజ ఎదగడానికి కావలసిందల్లా సరిపోయిన వాతావరణం.

**ఎదగడానికి అవసరమైన మూడు సూత్రాలు :**

ప్రకృతి ఎదుగుదల సూత్రం ఆధ్యాత్మిక విషయాలను నేర్పిస్తుంది. ప్రతికూలమైన వాతావరణంలో గోధుమ గింజ పెరగనే పెరగదు. అనుకూల పరిస్థితుల్లో అది ఎదగడం మాత్రమేకాక నాటడం ద్వారా తిరిగి పంట పండి వేలకొలది టన్నుల గోధుమల్ని ఉత్పత్తి చేస్తుంది.

ఇదే విధంగా ప్రతి మనిషిలోనూ దేవుడు అనుగ్రహించిన విశ్వాసపు గింజలో బ్రహ్మాండమైన శక్తి బంధించబడి ఉంటుంది. దానితో మనం ఏమి చేస్తున్నామనేది అది పెరుగుతుందా లేక గింజగానే నిలిచిపోతుందా అన్న దానిని నిర్ణయిస్తుంది.

గింజ ఎదగాలంటే దానికి మంచి పోషణ, సారవంతమైన నేల, నీరు, సూర్యరశ్మి కావాలి. ప్రకృతి సిద్ధమైన ఎదుగుదలా ఆత్మీయ ఎదుగుదలా రెండింటికి ఈ మూడు ముఖ్యమైన వస్తువులు కావాలి.

అలంకారికంగా చెప్పాలంటే విశ్వాసపు విత్తనం దేవుని వాక్యమనే నేలలో ఎదగాలి (అక్షరం కాదు (ఎఫెసీ 1:17), ఆత్మ వెల్లడింపు అనే పోషణ దానికి కావాలి), ఆ వాక్కుకు విధేయత అనే నీరు పోయాలి. దేవుని ప్రేమ అనే సూర్యరశ్మి పరిశుద్ధాత్మ మూలంగా

హృదయంపై ప్రసరించాలి (రోమా 5:5, గలతి 5:6)

**నేల – దేవుని వాక్యం వినడం.** విశ్వాసపు విత్తనం ఎదుగుదలకు కావలసిన నేల దేవుని వాక్యం అనడంలో కేవలం బైబిలు మాత్రమే అని నా ఉద్దేశం కాదు. రోమా 10:17లో ఇలా ఉంది.

"కాగా వినుట వలన విశ్వాసము కలుగును.....క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును."

పాత నిబంధనలోని ప్రవక్తల గ్రంథాల్లో తరచు **"యెహోవా వాక్కు** నాకు ప్రత్యక్షమై..." అని ప్రవక్తయైన యిర్మీయా, యాజకుడైన యెహెజ్కేలు లేదా హోషేయ వ్రాయడం చూస్తాము. అంటే రోమా 10:17లో చెప్పినట్లుగా దేవుని స్వరం లేక ఆయన మాట పరలోకం నుండి భూమి మీదనున్న మానవునికి తెలియజేయబడటాన్ని ఇది సూచుస్తున్నది.

యెహెజ్కే 33:7 లో దేవుడిలా చెప్తున్నాడు. **"నరపుత్రుడా, నేను నిన్ను ఇశ్రాయేలీయులకు కావలివానిగా నియమించి యున్నాను, గనుక నీవు నా నోటి మాటలను విని నాకు ప్రతిగా వారిని హెచ్చరిక చేయవలెను".** యెహెజ్కేలుకు దేవుడు ఒక బైబిలు వాక్యమివ్వలేదు. ప్రజలకు ప్రకటించడానికి అతనికి తన ప్రత్యక్షతను అందించాడు.

అలాగే దేవుని వర్తమానం మీకు కూడా అంటే మీ తలంపుల్లో, మీ మనసుల్లో, ఆత్మల్లో ఆయన ప్రత్యేకంగా మీతో మాట్లాడినట్లు మీరు తెలుసుకొనేరీతిలో బయలుపరుస్తాడు.

ఆయన ఈ కార్యాన్ని వాక్యం ద్వారా లేక ఒక వాక్య భాగం హృదయంలో ముద్రితమయ్యేలా చేస్తాడు. పూర్తి అర్థవంతంగా, ఆదరణకరంగా, మార్గదర్శకంగా ఉండే వాక్యాన్ని మీ అంతరంగంలో సజీవ వస్తువులా నిలుపుతాడు. లేదా బైబిలులో రాసి ఉన్నట్టు దర్శనం ద్వారా గాని, స్వప్నం ద్వారా గాని, దూత దర్శనం ద్వారా గాని ఆయనే స్వయంగా తన మాటను మీకు తెలియపరచవచ్చు.

దేవుడు తన స్వరాన్ని మీకు వినబడేలా మెల్లని చిన్న స్వరంతో అంతరంగ నిశ్చయతను కలిగించే విధంగా మీతో మాట్లాడగలడు. ఈ విధానాల్లో ఏ ఒక్కదాని మూలంగానైనా దేవుడు తన వాక్కును మీకు వెల్లడి పరుస్తాడు.

–(ఇంకా ఉంది)

– సేకరించబడినది

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

**సమర్పణా ప్రార్థనా :-**

మనలను దేవుడు వాడుకోవడానికి సిద్ధపరచునప్పుడు, మొదటగా మనలో తనను మహిమపరచని వాటిని తీసివేయడం మొదలుపెడతాడు. సరిగా లేని ఆలోచనా విధానం లేక చెడు తలంపులు లేక అలవాట్లు వంటివి.

ఉదాహరణకు తమ నోటి విషయములో ఎక్కువ మాటలు మాట్లాడే మనుష్యులు సమర్పణా ప్రార్థన చేసినప్పుడు, దేవుడు మొదటిగా వారు మాట్లాడే ప్రదేశములో పని మొదలుపెడతాడు. ఒకప్పుడు తాము మాట్లాడిన మాటలే ఇప్పుడు మాట్లాడలేకపోవడాన్ని వారు కనుగొంటారు, ఏమి మాట్లాడతున్నాము అనే విషయమై వారు జాగ్రత్తపడతారు. దినములు గడిచే కొద్దీ ఇతరులకు క్షేమాభివృద్ధి, ప్రోత్సాహం కలిగించే విధముగా దేవుని ఘనపరిచే విధంగా మాట్లాడడం వారు నేర్చుకుంటారు. అందరూ ఇదే విధమైన సమస్యతో కాదు కాని ఒక్కొక్కరు రకమైన సమస్యలను కలిగి ఉంటారు, వారిని తన ఉద్దేశ్య ప్రకారం వాడుకునే క్రమములో వారిని ఏ విషయాలలో బాగు చేయాలో ఆ విషయాలలో దేవుడు పని జరిగిస్తాడు.

మన జీవితములలోని కొంత మంది మనుష్యులను మన నుండి వేరుపరచడం కూడా ఒక మార్గమైయున్నది. ఉదాహరణకు మనం ఒక స్నేహితునిపై ఎక్కువగా ఆధారపడుట వలన మనం దేవునిపై ఆనుకొనవలసినంతగా ఆనుకొనలేక పోతుండవచ్చు. మనము సంబంధములలో సమతుల్యతను పాటించకపోయినట్లయితే దేవుడు వాటిని త్రుంచివేసి పూర్తిగా తనకు చెందునట్లుగా చేసుకుంటాడు. మనము ఒక సంఘము లేక సమాజములో ఉన్నతమైన మరియు సురక్షితముగా అనిపించు ఉద్యోగములో ఉన్నప్పుడు కూడా, దేవుడు మనలో పని జరిగిస్తాడు. మనం మన స్థాయిలలో కాక తనలో పాతుకొని ఉండాలని దేవుడు కోరుతున్నాడు. మనము ఒక నిర్దిష్టమైన పేరు ప్రతిష్ఠలు లేక అధికారము కలిగి ఉన్నందు వలన కాదు కాని ఆయన ప్రేమిస్తున్నందు వలననే అర్హత కలిగిన వారమయ్యామని మనం తెలుసుకోవాలని ఆయన ఇష్టపడుతున్నాడు. మనం సమతుల్యత పాటించలేని విషయములను ఆయన తీసివేస్తాడు.

స్నేహితులను లేక మంచి స్థితులను కలిగి ఉండుటలో తప్పులేదు నిజానికి ఈ రెండింటిలో ఆనందించాలని ఆయన కోరుకుంటున్నాడు. కాని మనం వాటిపై ఎక్కువగా ఆధారపడటం ఆయనకు ఇష్టం లేదు. ఈ ప్రపంచములో ప్రతీది ఒక్క నిమిషంలో కదిలింపబడి మార్చబడుతుంది, దేవుడు మాత్రమే ఎన్నటికీ మార్పులేని వాడిగా ఉన్నాడు.

మనుష్యులు మరియు పరిస్థితులు మనం ఊహించని విధంగా మారినప్పుడు మనం బాధపడి నిరుత్సాహపడకుండునట్లుగా, మనం మొదటిగా మరియు ఎక్కువగా తనపై ఆధారపడాలని దేవుడు కోరుతున్నాడు.

మనం సమర్పణ ప్రార్థన చేసినట్లయితే, దేవుని యొక్క అగ్ని వచ్చి మనలను, మన జీవితములను శుద్ధపరచుటను ఊహించవచ్చు. సమర్పణా ప్రక్రియ సామాన్యంగా సౌకర్యవంతమైనది లేక సులభమైనదు కాదు. కాని ఇది ఎల్లప్పుడూ మేలుకరమైనది మరియు దాని ఫలితములు అత్యద్భుతమైనవి.

**సంపూర్ణ సమర్పణ :**

దేవునికి పూర్తిగా సమర్పించుకొనిన జీవితములు జీవించే క్రైస్తవులు సాతానుకు అపాయకరంగా మారతారు. ఈ విధమైన సమర్పణ అంటే మనం సమస్తం దేవునికి ఇచ్చివేయుట, ఏదీ దాచిపెట్టుకొనకుండుటయే. ఎప్పుడైతే మనం దేవుడికి సమర్పించుకుంటామో అప్పుడు దేవునికి మనకు సంబంధించిన ప్రతి విషయం స్పష్టంగా ఉంటుంది.

దేవుని కొరకు ఉపయోగించబడుటకు సమర్పించుకొనుటను గూర్చి మనము జాగ్రత్తగా ఆలోచన కలిగి ఉంటే, మనము దేవుని దగ్గర దాచి పెట్టిన విషయములు ఏమైనా ఉన్నాయేమో చూచుకోవాలి. ఎటువంటి చిన్న మరియు దాచిన రహస్య ప్రదేశములు మన హృదయములలో ఉన్నాయా ? మనం ఏయే విషయముల నిమిత్తం "ప్రభువా ఆ ఒక్కటి తప్ప, నువ్వు అన్నీ తీసుకోవచ్చు" లేక "ప్రభువా అది మానమని మాత్రం చెప్పొద్దు" అని ప్రార్థిస్తున్నాం? సంపూర్ణ సమర్పణ అంటే "ప్రభువా నేను రోజూ బైబిల్ చదువుతాను నేను వాక్యాలు కంఠస్థం చేసి నీ వాక్యాన్ని నా హృదయములో దాచుకుంటాను రోజులో అధిక సమయం ప్రార్థనలో గడుపుతాను, కాని "ఒక్క నా కిష్టమైన లోపమును మాత్రం వదులుకొమ్మని చెప్పొద్దు !" అని చెప్పటం కాదు. సంపూర్ణ సమర్పణ అంటే ప్రభువా, నీకు నన్ను నేను సంపూర్ణముగా సమర్పించుకుంటున్నాను" అని పూర్ణ హృదయంతో చెప్పటం.

సేకరించబడింది (జాయిస్ మేయర్)

ఇంకా ఉంది

# ధనమును ఆశించిన.....

యేసు ఎన్నుకున్న పన్నెండు మంది అపోస్తలులలో ఒకడిగా ఉన్న యూదా ఇస్కరియోతుకు దేవుని చేత మెప్పు పొంది, యోగ్యుడిగా అనిపించుకోవడానికి మిగతా వారిలాగానే చక్కటి అవకాశం ఉంది. అలాగే ఇతరుల్లాగానే అతడు కూడా పరీక్షను ఎదుర్కొనవలసి వచ్చింది. సువార్త గ్రంథములు అతడిని "ద్రోహియగు ఇస్కరియోతు యూదా" (లూకా 6:16) అంటున్నాయి. యేసు అతనిని ఎన్నుకున్నప్పుడు మిగతా 11 మంది శిష్యుల్లాగానే అతడూ యధార్థవంతుడే. అయితే స్వార్థపూరితమైన కోర్కె వలన అతడు దారుణంగా పతనమయ్యాడు. "స్వార్థాపేక్షలు ఎక్కడ ఉన్నాయో అక్కడ అక్రమమూ, ప్రతి విధమైన చెడుగూ ఉంటాయి" (యాకోబు 3:16) అని బైబిల్ మనలను హెచ్చరిస్తుంది. యూదా జీవితము మనందరికీ ఒక హెచ్చరిక ఎందుకంటే మనం జాగ్రత్తగా లేకపోయినట్లయితే, మనమూ అతని లాగే మారే అవకాశం ఉంది.

యేసు బృందమునకు అతడు కోశాధికారి. ధనం విషయములో తన నమ్మకత్వమును ఋజువు చేసుకొనేందుకు కావలసినంత అవకాశం అతనికి ఉంది. అతడు నమ్మకస్తుడిగా ఉన్నట్లయితే క్రొత్త నిబంధన పత్రికలను రాసిన రచయితల్లో అతనూ ఒకడయ్యేవాడు. నూతన యెరూషలేము ప్రాకారపు పునాదులపై అతని పేరు ఖచ్చితంగా ఉండేది. **"ఆ పట్టణపు (నూతన యెరూషలేము) ప్రాకారము పన్నెండు పునాదులు గలది ఆ పునాదులపైన గొర్రెపిల్ల యొక్క పన్నిద్దరు అపొస్తలుల పండ్రెండు పేర్లు కనబడుచున్నవి" అని (ప్రక 21:14)** లో చదువుచున్నాము. అయితే పరీక్షించబడినప్పుడు ఇస్కరియోతు యూదా ఓడిపోయాడు. పేదలకు సహాయం చేసే ఈ పని పట్ల తనకు ఆసక్తి ఉన్నట్లు యూదా చెప్పుకున్నప్పటికీ, పేదల కోసం వేరు చేసిన ధనమంతటినీ అతడు దొంగిలించేవాడు. **బీదల మీద శ్రద్ధ కలిగి కాదు గాని వాడు దొంగయై యుండి, తన దగ్గర డబ్బు సంచి యుండినందున అందులో వేయబడినది దొంగిలించుచు వచ్చెను. (యోహాను 12:4-6)**

యేసు ఎందుకని అప్పుడే యూదాను బట్టబయలు చేయలేదు? అని మనం ప్రశ్నించవచ్చు. ఈ ప్రశ్నకి జవాబు చెప్పుకోవాలంటే మనం ఇంకొక ప్రశ్న వేసుకోవాలి. "క్రైస్తవ్యం పేరట నేడు డబ్బు చేసుకుంటున్న వారందరినీ యేసు ఎందుకని బట్టబయలు చేయడం లేదు? నేటికీ డబ్బు కోసమే దేవుని సేవిస్తున్న వారు వేలమంది ఉన్నారు. దేవుని పని కోసం ఇవ్వబడిన ధనం విషయములో నూటికి నూరు శాతం నమ్మకంగా లేని వారూ ఉన్నారు. ధనాన్ని ఎంచుకోవడం వలన తానేమి కోల్పోబోతున్నాడో యూదా తెలుసుకుని ఉన్నట్లయితే, అతడెంత భిన్నంగా ప్రవర్తించి ఉండేవాడు, అలాగే ధనాన్ని కోరుకోవడం వలన తాము ఏమి పోగొట్టుకుంటున్నామో విశ్వాసులు, సేవకులు గ్రహించగలిగితే, ధనం విషయంలో ఇప్పటి కంటే భిన్నంగా ఉంటారు.

యూదా సమస్య ఏమిటంటే, అతడు పుచ్చుకోవడాన్ని ప్రేమించాడు, ఇవ్వడాన్ని ద్వేషించాడు. యేసు తన శిష్యులకు ఇవ్వడంలోని ఆశీర్వాదాన్ని గురించి బోధించాడు. "పుచ్చుకొనుట కంటె, ఇచ్చుట ధన్యము" అని ప్రభువైన యేసు చెప్పెను" (అపొ.కా॥ 20:35)

పేతురు దీనిని గ్రహించాడు, కానీ యూదా అర్థం చేసుకోలేకపోయాడు. అంతకు అంత

 **కృతజ్ఞత అనేది ఒకరిపట్ల చూపించవలసిందే కాని ఒకరి నుండి ఆశించవలసింది కాదు.**

మరింత పుచ్చుకోవడం ద్వారా సంతోషం కలుగుతుందని అనుకున్నాడు. ప్రతి క్రైస్తవుడూ ఈ రెండు తరగతుల్లో ఏదో ఒకదానికి చెందిన వాడైయుంటాడు. పేతురులాగా సమస్తాన్నీ విడిచి, దేవునికి, అవసరంలో ఉన్న ఇతరులకు ఇవ్వడాన్ని ప్రేమించేవారు. యూదాలాగా పుచ్చుకోవడాన్ని ప్రేమించి తమ కోసం కూర్చుకొనేవారు. ఒకవేళ ఎప్పుడైనా ఇటువంటి "యూదాలు" ఇచ్చినట్లయితే, అతి కష్టంగా, పిసినారితనంగా, మనస్సాక్షి పోరు పడలేక – అది కూడా ఎంతో అయిష్టంగా ఇస్తారు ! అదే పుచ్చుకొనే విషయంలోనైతే వారికి ఎటువంటి కష్టమూ అయిష్టమూ ఉండదు ! మనం ఈ లోక కట్టడలను అనుసరించి జీవించడానికి ఇష్టపడుతున్నామా లేక ఆయన రాజ్య కట్టడలను అనుసరించి జీవించడానికి ఇష్టపడుతున్నామా అని చూడడానికి ఇచ్చే విషయంలోను, పుచ్చుకొనే విషయంలో కూడా దేవుడు మనల్ని పరీక్షిస్తాడు.

దేవుని చేత యోగ్యులు అనిపించుకోవాలి అనుకుంటే, మన శరీర స్వభావంలో ఉన్న "బహుమానాలు పుచ్చుకోవాలనే ఆశ, ప్రేమ" లను సంపూర్ణంగా సిలువ వేయాలి. పాత అలవాట్లు మానుకొని, వాటికి బదులుగా కొత్తవాటిని మనం నేర్చుకోవాలి. గతంలో బహుమానాలు పుచ్చుకోవడంలో మనమెంత చెయ్యి తిరిగిన వారమో అదే విధంగా ఇప్పుడు ఇవ్వడంలో అంతముందడుగులో ఉండాలి. అయితే, ఒక్క రాత్రిలోనే మనం ఏ విషయంలోనూ నిపుణులమైపోలేము. మనల్ని ఏ విషయంలోనైనా నిష్ణాతులను చేసేది నిరంతర సాధనే. మనం ఇవ్వడం ప్రారంభించాలి. పుచ్చుకోకుండా, ఇచ్చేవారిగా ఉన్నామని మన గురించి దేవుడు సాక్ష్యమివ్వగలిగేలా మన జీవితాలు నిజంగా మార్పుచెందేంతవరకు దానిని మనం కొనసాగించాలి. దేవుని విషయంలో ధనికుడు కావడం ఎలాగో తెలుసుకున్నవాడూ, అవసరంలో ఉన్న ఇతరులకు ఇవ్వడం నేర్చుకున్నవాడే యేసుకు నిజమైన శిష్యుడు.

ధనం విషయంలో మనం అపనమ్మకంగా ఉంటే దేవుని దగ్గర నుండి ఆత్మీయ ఐశ్వర్యాలను ఎన్నడూ పొందలేమని యేసు బోధించాడు. ఆయన అన్నాడు, **"మీరు అన్యాయపు సిరి విషయములో నమ్మకముగా ఉండని యెడల సత్యమైన ధనమును ఎవరు మీ వశము చేయును ?" (లూకా 16:11)**

యూదా ఇస్కరియోతు డబ్బు సంచితో పరీక్ష కాలంలో ప్రభువు ఉంచాడు. అతడు ఓడిపోయాడు. అతడి నష్టం శాశ్వతమైనది. నేడు మన డబ్బు సంచితో, నీవూ, నేనూ కూడా పరీక్షా కాలంలో ఉన్నాం.

కాబట్టి ధనం విషయములో ప్రతి ఒక్కరూ స్పష్టమైన వైఖరిని అనగా లేఖనములలో మనకు తేటతెల్లగా తెలియపరిచిన విధముగా నడుచుకొన వలసిన వారమై యున్నాము.

(మిగిలిన భాగం వచ్చే సంచికలో)

– సేకరించబడినది




# బైబిల్ క్విజ్ -34

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.
(ఆదికాండములో నుండి ఇవ్వబడినవి)

**1. ఫరో యోసేపుకి పెట్టిన మరో పేరు ఏమిటి?**

**2. లూజు అనే ఊరికి ఇవ్వబడిన క్రొత్త పేరేమిటి?**

**3. యోసేపు ఎన్ని తులముల వెండికి అమ్మివేయబడ్డాడు?**

**4. నీళ్ళ వలె చంచలుడై బలాతిశయము పొందనిది ఎవరు?**

**5. బైబిల్‌లో ప్రస్తావించబడిన మొదటి కల ఎవరికి కలిగింది?**

**6. అరణ్యములో ఉష్ణధారలను కనుగొన్నది ఎవరు?**

**7. ఆవులు ఆవులను తినే కల ఎవరికి కలిగింది?**

**8. "నేను ముఖాముఖిగా దేవుని చూచితిని, అయినను నా ప్రాణము దక్కింది" అని చెప్పినది ఎవరు?**

**9. ఐగుప్తులో యాకోబు కుమారులు ఎక్కడ నివసించారు?**

**10. యోసేపు తన సహోదరులలో ఎవరిని పట్టుకొని బంధించాడు?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జూన్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జూలై 2014 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్వర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 500 070.

**<u>బైబిల్ క్విజ్ – 33 జవాబులు (ఆదికాండము) :</u>**

1. ఊజు 10:23
2. హేబేలు 4:8
3. షీనారు 11:2
4. 7వ నెల 17వ రోజు 8:4
5. నిమ్రోదు 10:8,9
6. దమస్కు ఎలీయెజరు 15:2
7. నెమ్మది 5:29
8. లోతు భార్య 19:26
9. చితిసారకపు చెట్టు 6:14
10. షీనారు దేశమందు బాబెలులో 11:9

**<u>బైబిల్ క్విజ్ – 33 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

కమల, త్రినాథ్, పాపరమేష్, షీబా, రాజుఫ్లోరెన్స్, ఐజాక్‌కుమారి, పాల్‌రాజ్, విఠల్, జయమ్మ, జగదీష్‌కుమార్

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**“ నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! ”**

## మే - జూన్

**భాగ్యలత:** గోపాలం, జయంతి, శిరీష, అశోక్‌కుమార్, సాయిలత, రమేష్, దానియేల్‌రాజ్, భీమశంకరరావు, అరుణ్‌కుమార్, జ్యోతి, సుజాత, శ్రీలత, మల్లిక, గ్లోరియరాజ్, శ్రీలక్ష్మి, రవితేజ, మధురిమ, సుశాంతి, మార్త, సామ్యేల్, రాజేష్, గౌతమి, వాణి, నాగరాజు, రూతు, సలోమి, మేఘన, బసవపూర్ణమ్మ, నవ్య, అంజలి, సాయికుమార్, సద్గుణ, రఫీ, శారదకుమారి, రాజేష్, దుర్గప్రసన్న, పూజ, ఆషా, అమలజ్యోతి, మానస, తిరుపతిరావు, మనోజ్, మణి, జాషువా, ప్రవల్లిక, నితేష్, మధుసూధన్‌రెడ్డి, విజయవందన, నవ్యక, కృపాజ్యోతి, రాజేశ్వరి, మనుజ, గాయత్రి, సూర్యప్రభ, గిద్యోను, ప్రీతి, దానియేల్, రోసీప్రకాశ్, శాంతి, సుజాత, ఫ్రాన్సిస్, వెంకటేశ్వరరావు, కౌముది, అవినాష్, వసంతరాణి, నవీన్, అనిత, శేషగిరి, విజయకుమారి, హేమాంబరావు, కనకదుర్గ, సంధ్యారాణి, అగస్టీనా, జోజిబాబు, ఆదిలక్ష్మి, వెంకటేష్, లావణ్య, శ్రీను, కృష్ణకళ్యాణ్, బాబు, వివేక్, శేఖర్‌బాబు, వినయ్‌కుమార్, విజయలక్ష్మి, అనిల్‌కుమార్, కిరణ్, రామకృష్ణ, నందిని, ఆనంద్, మేరీరత్నం, ఆనంద్‌రాజ్, నవీన, జాన్, మాధురి, హారిక, రోషిణి, పాల్‌రాజ్, వీరలింగం, జయరాజు, ఫిలిప్పు, మన్యం, లక్ష్మీ, విజయ, లత, ప్రియాంక, మధుబాల, గీతాసాత్విక, ఆనందప్రసాద్, మణికాంత్‌రెడ్డి, శారమ్మ, ప్రశాంతి, ప్రశంస, మమత, శేఖర్ (సింగపూర్)

**చింతల్ :** విజయ, సాత్విక్, శామ్సన్, సాల్మన్‌రాజు, జీవా, రమ్య, శ్రీనివాసరావు, జగన్‌మోహన్‌రావు, అనూష, లత, గోపీచంద్, ఐజాక్‌కుమారి, వెన్నెల, నిహారిక, రవీందర్, జాన్సన్, సురేష్‌బాబు, స్వర్ణలత, మల్లేశ్వరి, సంధ్యారాణి, ప్రజ్ఞ, సునీత, ఆనంద్‌కుమార్, బాబూరావు, అభిషేక్, మరియ, బెంజిమన్, రాధాకృష్ణ, దేవకిరణ్, విజయమ్మ, సురేంద్ర, ఎలిజబెత్‌రాణి, వివేకవతి, నిర్మల, ప్రశస్థ, ఎస్తేరురాణి, రూతమ్మ, జీవమణి, జగన్, విజయ్, కృపారాణి.

**అనాజ్‌పూర్ :** జీవన్‌కుమార్, మృణాళిని, మహాలక్ష్మి, ఆంద్రెయ, జోషువా, నరసింహ, రాజ్‌కుమార్, రత్నాకర్, కారుణ్య, సుజిత్‌కుమార్, బ్లెస్సీ, మరియమ్మ, మేరిసియోనా

**ఇ.సి.ఐ.యల్ :** విజయ్‌కుమార్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

మీ ప్రార్థనావసరతలు:

______________________________

______________________________

______________________________

______________________________


మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,

భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

2014 ఏప్రిల్ 18 వ తేది - హైదరాబాద్ - హయత్ నగర్, వర్డ్ అండ్ డీడ్ స్కూల్,
ఛాపెల్ ఆడిటోరియం నందు జరిగిన "గుడ్ ఫ్రైడే" ఆరాధనలో అనేకులు పాల్గొని దేవుని ప్రార్థించిరి.



**2014 మే 1 వ తేది - హైదరాబాద్ - హయత్ నగర్, వర్డ్ అండ్ డీడ్ స్కూల్, ఛాపెల్ ఆడిటోరియం నందు జరిగిన ప్రత్యేక ఉపవాస ప్రార్థనలో పాల్గొనిన సహోదర సహోదరీలు.**






# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras